# వయసు పదమూడు

ఆంధ్రప్రభ 24-7-85

కాలం మారింది. ఆడపిల్లలమీద మోహా ముసుగు తొలిగిందిగానీ ఇది సంధియుగం, తల్లికిదో సమస్య.

—జయప్రద

---

"అమ్మా! ఫ్రెండ్స్‌తో ఈరోజు సినిమాకెళతాను"

పదమూడేళ్ళ సంగీత బెరుగ్గా అడిగింది.

చాపమీద కూర్చుని చీరకు ఫాల్ కుట్టుకుంటున్న అరవింద కళ్ళెత్తి ఒకసారి కూతురువేపు చూసి మరలా పనిలో నిమగ్నం అయిపోయింది.

కూతురు తనని అర్థంచేసుకుని మరోసారి అడగదని ఊహించని అరవింద ఊహ అబద్ధమయింది.

"ఈసారికి క్షమ్మీ!"

బాలా మెత్తగా అడుగుతున్న కూతురి కోరిక తీరిస్తే బాగుణ్ననే వుంది అరవిందకు.

కానీ ఆమె మరోక్షణం ఆలోచించి తల అడ్డంగా వూపింది.

"మనం రేపెళదాం, వెళ్ళి చదువుకో"

ఆ అమ్మాయి కదలలేదు.

"చదువుకోవాల్సింది ఏమీ లేకపోతే కూర్చో-నాకు హెల్ప్ చేద్దువు"

సంగీతది ఆశల్ని, కోరికల్ని చంపుకునే వయసు కాదు.

ఎలాగయినా కోరిక తీర్చుకోవాలనే టీనేజ్‌లో అడుగు పెట్టిన పిల్ల సంగీత.

"ఈసారికి వెళతాను మమ్మీ! ఫ్రెండ్స్‌కు చెప్పేశాను-బాగుండదు."

తలెత్తి చిత్రంగా కూతురివేపు చూసింది అరవింద.

'అసహ్యాలు, అరమరికలు తెలీని బాధ్యతనుండి సంగీత అప్పుడే ఎదిగిపోయిందా? ఎవరేమనుకుంటారో అనే ఫాల్స్ ప్రిస్టేజ్‌లో పడిపో యిందా?'

మనసులోనే నవ్వుకుంది అరవింద.

చెయ్యి చాపి కూతురి చెయ్యి అందుకొని లాగి పక్కనే కూర్చో బెట్టుకుంది.

"నే చెపుతాలే సంగీతా మీ ఫ్రెండ్స్‌తో. ఏమీ అనుకోరులే"

తలవంచుకుంది సంగీత.

చాపమీద చూపుడు వేలితో గీతలు గీస్తూ అంది.

"ఇంకెప్పుడూ నిన్నడగనులే. ఫ్రెండ్స్‌కు చెప్పాను-ఈరోజు మాత్రం కాదనకు-ప్లీజ్"

కాన్వెంట్‌లో చదువుతున్న కూతురి గుండెలో గాఢంగా వున్న కోరిక బరువును గ్రహించిన అరవింద మెత్తబడింది.

"ఏ సినిమాకు?"

"హీరో"

"హీరో..." క్షణం ఆలోచించింది అరవింద.

"ఓకే! నాకూ చూడాలని వుంది. మీ ఫ్రెండ్స్‌తో చెప్పు మనిద్దరం వస్తున్నామని"

తడబాటుగా చూసింది సంగీత.

పక్కకు జరిగి తల్లి తొడమీద చెయ్యి వేసింది.

"మమ్మీ, బాగుండదేమో?"

"బాగుండదా? ఎందుకు బాగుండదు?"

అరవింద గుండెలమీద చిన్న దిగులు తెర పలచగా పరుచుకుంది.

పదమూడేళ్ళ క్రితం ఓరోజు సంధ్యాసమయంలో తన ఒళ్ళో ఉదయించిన ఎర్రటి మాంసం ముద్ద-నిన్న మొన్నటిదాకా తన ఒడిలో నుండి బడికి వెళ్ళనని మారాంచేసిన తన చిన్నారిపాప ఈరోజు తన కొంగు వదిలేసి పారిపోతానంటోంది.

తను ముద్దలు కలిపి పెడితేనే తినే సంగీత ఈరోజు తన కంపెనీ నచ్చనట్లు చెప్పక చెపుతోంది.

మంచిదే. ఏనాడయినా తన కొంగు వదలాల్సిందే.

కానీ తన కొంగు వదిలేసి మరొకరి చిటికెనవేలు పట్టుకునే లోపల మధ్యకాలం....

ఆ మధ్యకాలం....

"మమ్మీ! పిక్చర్‌కు ఏ డ్రెస్ వేసుకోను?"

ఉలిక్కిపడింది అరవింద.

"సంగీత చాలా ఎదిగిపోయింది"

దిగులుగా నిట్టూర్చిందామె.

"ఊహుఁ ...నీకు మొన్ననే చెప్పాను. ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళకూడదని. కావాలంటే మీ ఫ్రెండ్స్‌ను రమ్మను. మనం వెళ్ళేపుడు తీసుకెళదాం"

"అదికాదు మమ్మీ!"

"ఇంకేం మాట్లాడకు-వెళ్ళి చదువుకో"

★ ★ ★ ★

"సంగీత ఏడుస్తోంది-ఫ్రెండ్స్‌తో పిక్చర్‌కు వెళ్ళొద్దన్నావు అట"

తలెత్తి చూసింది.

తన ఎదురుగా తెల్లటి నిలువెత్తు విగ్రహం.

తలవంచుకుంది అరవింద.

"ఊఁ.....వద్దన్నాను"

విసురుగా బుట్ట కుర్చీ లాక్కొని కూర్చున్నాడతను.

"వద్దన్నావని తెలుసు. ఎందుకు వద్దన్నావని అడుగుతున్నాను"

కళ్ళెత్తి చురుగ్గా చూసింది.

"నా కూతుర్ని వద్దనే అధికారం నాకుందనుకుంటున్నాను"

"అదే అదే ఆ పొగరే వదంటాను"

"పొగరా?" చిన్నగా నవ్విందామె.

"ఇది పొగరే అయితే ఆ పొగరు నేర్పింది మీరే"

అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

ఆమె మరలా తల వంచుకుని సూదిలోనుండి ఊడిపోయిన దారాన్ని తిరిగి ఎక్కించుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"మరి ఈ సంసారం....నీ చేతిలో నియంతృతమైపోయింది."

అతను విసురుగా లేచాడు.

కుడుతున్న చీర వదిలేసి ఆమె కూడా లేచింది. వెళ్ళబోతున్న అతని చెయ్యి పట్టుకుంది.

"నియంతృత్వం నాకు సంతోషమా? ఈ సంసారాన్ని పది కళ్ళతో- కాపాడుకోవడాన్ని నియంతృత్వమంటారా? ఓ.కే. అలాగే అందాము. కానీ, అదే నియంతృత్వం మీ చేతిలో వుంటే నాకెంత హాయిగా వుండేది! ఎంత నిశ్చితంగా వుండేది!"

"అంటే?" చెయ్యి విసురుగా లాక్కుంటూ అన్నాడతను.

"కూర్చోండి. చాలా కాలం తరవాత ఈ రోజు మనిద్దరం మనసులు విప్పి మాట్లాడుకుందాం."

మెత్తగా, అర్థింపుగా అంటున్న భార్యవైపు కోపంగా చూశాడే. కానీ, అతను కూర్చోలేదు.

ఆమె దగ్గరగా వచ్చింది. విడిలించుకున్న అతని చెయ్యి పట్టుకుని అతని కళ్ళలోకి చూసింది. ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర.

"ప్లీజ్....కూర్చోండి."

అతను కుర్చీలో కూర్చున్నాడు. ఆమె మరలా చిరుచాపమీద కూర్చుంది.

"నే నీ ఇంటికి రాకముందు మీకు ఎన్ని ఎకరాల్నున్నాయి? ఎన్ని ఇళ్ళున్నాయి?" అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది.

"పన్నెండెకరాలు, రెండిళ్ళు వున్నాయి–ఏం?"

"ఈ రోజు మన ఆస్తి ఎంత?"

అతను మాట్లాడలేదు.

"రెండెకరాలు-అదీ మా పుట్టింటి వాళ్ళు తెలివిగా నామీద వ్రాసిన ఆస్తి ఈ అద్దె ఇల్లు.... అవునా?"

"అవును....ఏం నువ్వు నా వెనుక ఆస్తి చూసే నన్ను ప్రేమించావా?"

ఆమె తల అడ్డంగా ఊపింది.

"లేదు మీకేమీ లేకపోయినా సంతోషంగా మీతో వచ్చేదాన్నే. సమర్థత వుండాలేకానీ, మగవాడు భార్యా పిల్లల్ని ఏ విధంగా పోషించుకోలేడు, మీకులా బాధ్యత ఫీల్ అవకపోతే తప్ప! ఉహు. కోప్పడకండి. వున్న సత్యం ఇది. మనల్ని, మన సంతోషాన్ని, మన మన శ్శాంతిని తుడిచిపెట్టేసిన నిజం అది."

"నేను కోట్లు సంపాదించి నీ ఒళ్ళో పోయలేదని దుగ్ధ నీకు."

ఆమె నవ్వింది. చాలా విరక్తిగా నవ్వింది. "ఈ పదిహేనేళ్ళ కాపురంలో నేనేమిటో మీకు తెలుసు. అయినా, తెలిసీ యిలా మాట్లాడుతుంటారు. నన్ను బాధపెట్టడం మీకు సరదా: కానీ, మిమ్మల్ని బాధపెట్టడం నాకు సరదా కాదు. వున్న నిజాలు చెప్పి మీరు మారాల్సిన అవసరం మీచేత గుర్తింపుచేయాలనేదే నా తపన."

"ఆహా! ఏం సాధ్వీమణివి!"

విసురుగా తలెత్తి చురుగ్గా చూసిందామె అతనన్న ఆ మాట నేరుగా వచ్చి ఆమె గుండెలో గుచ్చుకుంది.

"నేను సాధ్వీమణినే- ఆ విషయం నాతోపాటు మీకూ బాగా తెలుసు. మీ హృదయానికి గాఢంగా తెలుసు. దాన్ని మీరు బయట పెట్టుకోవడానికి ఇష్టపడకపోతే పోనివ్వండి నా కభ్యంతరం లేదు "

అతను మాట్లాడలేదు. ఆమెకు ఈ మధ్య అతను కొద్దిగా భయ పడుతున్నాడు. ఆమె సంతరించుకున్న బాధ్యతలకు జంకుతున్నాడు. ఆమె ఇప్పుడు ఈ సంసార బాధ్యతల్ని పూర్తిగా మోస్తున్న గృహిణి.

"సాధ్వీమణి అంటే ఎలా వుండాలండీ? గ్లాసు తెచ్చి కన్నీళ్ళు మింగేసి చిరునవ్వు అరువు తెచ్చుకుని బ్రాందీతో మీ గ్లాసు నింపాలి. అవునా!"

"ఎవరు చెప్తారు అలా అని?"

"ఎవరు చెప్తారా? మీ కోరికమేర అలా నింపిన రోజులు లేవూ? ఈనాడు గుండె రాయి చేసుకుని....ప్రేమను, జాలిని అణగదొక్కుకుని మీ మాటకెదురు చెప్పి ఈ మాత్రం పిల్లలకు అన్నం పెట్టగలుగు తున్నాను కానీ....ఆ రోజుల్లో మీరేం మనసు కష్టపెట్టుకుంటారో అని ఆస్తులు కరిగదీసి వాటిని బ్రాందీగా మార్చి మీరు తాగుతుంటే కన్నీళ్ళు పెట్టుకున్నానే కానీ కాదన్నానా?"

"ఏం? పతివ్రత కబుర్లు చెప్పకపోతే ఆనాడే కాదనచ్చుగా ఈ రోజు కుక్కలా నన్ను చూడకపోతే!"

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"మిమ్మల్ని కుక్కలా చూస్తున్నానా? ఆ రెండెకరాల్లో వచ్చే ఆదాయాన్ని మాత్రం తాకడంలేదు దాన్ని పాప పేరుమీద బాంకులో వేస్తున్నాను. ఆ రెండెకరాలు కూడా అమ్మమంటే అదన్నా బాబుకు మిగల్చాలని మిమ్మల్ని కాదన్నానే కానీ టైలరింగులో వచ్చినదాంట్లో మీకు పెట్టికాని నేను తినడంలేదు. ఇక మీరు తాగడానికి వందలు వందలు మీ చేతి కివ్వాలంటే అది నా శక్తికి మించిన పని."

"నీ మోచేతి నీళ్ళేమీ నా కక్కర్లేదు. ఈ వాగేదేదో అనాడే వాగుంటే నా ఎకరాలు నాకు మిగిలుండేది."

"నిజమే. చాలా పొరపాటు చేశాను. మీరు దిగులుగా వుంటే చూళ్ళేక, మిమ్మల్ని అతిగా ప్రేమించిన దౌర్బల్యంతో మిమ్మల్ని అడ్డు పెట్టలేక పొరపాటు చేశాను."

"అంటే....ఇప్పుడు నా మీద ప్రేమ చచ్చిపోయిందన్న మాట. మిమ్మల్ని పెళ్ళి చేసుకోకపోతే చచ్చిపోతాను అన్నదంతా కల్లబొల్లి కబుర్లన్న మాట."

ఆమె పేలవంగా నవ్వింది.

"నిజం! ఆ రోజు బహుశః మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేకపోతే నిజంగానే చచ్చిపోయుండేదాన్నేమో! అంతలా నా పసివయసుమిమల్ని ప్రేమించింది. ఇప్పుడూ మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను. కానీ, ఇప్పుడు నేను పదహారేళ్ళ అరవిందను కాదు–ఈ ఇంటి గృహిణిని.... ఇద్దరు పిల్లలకు తల్లిని. బాధ్యతలేని భర్తకు భార్యను. ఈ బాధ్యతల్ని మర్చిపోలేని ముప్పయేళ్ళ ఆడదాన్ని."

"వయసు పెరిగేకొలదీ ప్రేమ చచ్చిపోతుందికాబోలు."

వ్యంగ్యంగా అంటున్న భర్త వైపు నిస్సహాయంగా, దిగులుగా చూసిందామె.

"సరేలే! నీతో నాకు వాదనెందుకు? నీ ప్రేమ లేకపోతే చచ్చిపోతానా ఏమిటి? ఈ రోజు పెద్ద బిల్ వచ్చినట్టుంది నీకు. సెలిబ్రేట్ చేసుకుందాం.

ఓ పాతిక ఇలా ఇవ్వు."

"మీరు మారరు....మీరు మారరు...." ఆమె విసురుగా లేచి పెరట్లోకెళ్ళిపోయింది.

* * * *

"అరూ! నువ్వు పిల్లల ప్రేమను కూడా పోగొట్టుకుంటున్నావేమో అని భయమేస్తోంది నాకు."

మెషిన్ తొక్కుతున్న అరవింద్ కాళ్ళలో చలనం ఆగింది. చెయ్యి అడ్డంపెట్టి చక్రం ఆపి స్నేహితురాలివైపు చూసింది అరవింద.

"ముందు కూర్చో. ఆ తరవాత చెప్పు ఎందుకలా అనుకుంటు న్నావో?"

"సంగీతను సినిమాకు వద్దన్నావట."

"ఈ రోజు సినిమాకు పంపించనన్నానని నాకు దూరమయి పోతుంటుంటావా? పోనీ, హేమా, ఈ రోజు కాకపోతే రేపొద్దున తను తల్లి అయ్యాక ఈ తల్లి మనసు అర్థం చేసుకుంటుంది. అంతే చాలు. నా చేతుల్లో నా బిడ్డలు బాగుపడాలి-అదే నా కోరిక."

"కాస్సేపు ఆ మెషిన్‌మీదలే. అలా పైకెళ్ళి మాట్లాడు కుందాం."

"ఇంకొద్దిగా కుట్టాలి. ఈ రాత్రికి ఇస్తానని చెప్పాను."

"ఫరవాలేదు-రా ఓ పది నిమిషాలు- అంతే. కావాలంటే నేను నీకు హెల్ప్ చేస్తాను తరవాత."

"సరే పద" నిట్టూర్చి లేచింది అరవింద.

"చూడూ....నీ సంసారాన్ని చాలా పొదుపుగా, తెలివిగా లాక్కొ స్తున్నావు నువ్వు. అది నాకు చాలా సంతోషం, నలుగురి ముందు చెయ్యి చాపి పంచ భక్ష్య పరమాన్నాలు తిని మనశ్శాంతిని కోల్పోయేకంటే వున్నంతలో తిని, కాస్త కడుపులో పెట్టుకుని పడుకోవడం మంచిదే. కానీ, అరూ, అన్నిటికంటె బాల్యం అపురూపమైంది."

గోడ కానుకుని వింటూంది అరవింద.

"నీకు తెలుసు–నా బాల్యాన్ని తలుచుకుంటే నాకెంత అశాంతిగా వుంటుందో! మా మేనమామల ఇంట్లో ఎలాంటి స్వతంత్రం లేకుండా, ఆటా పాటా లేకుండా, ఎప్పుడూ విసుర్లు కసుర్లు తప్ప మంచి మాట వినకుండా పెద్దయిన నేను ఈనాడు నా భర్తతో హాయిగానే వుంటున్నా నా జీవితంలో ఏదో లోపించిన భావంతో బాధపడుతుంటాను. వింటున్నావా?"

"ఊఁ.....చెప్పు."

"ఆలాటిది సంగీతకు రానీకు. నువ్వు రాత్రి పిల్లలిద్దరకూ కలిపి ఓ పావుశేరు పాలిస్తున్నావు. రెండు రోజులు ఆ పాలివ్వడం మానేసి వాళ్ళనో రోజు సినిమాకు పంపు."

"హేమా.....హేమా..... నువ్విలా అనుకుంటున్నావా? రెండు రూపాయలు సినిమా కివ్వలేకే పంపడం లేదనుకుంటున్నావా?"

"అది కాదు నా ఉద్దేశం....." తడబడింది హేమ.

"నువ్వు నా దరిద్రాన్ని ఎత్తి చూపిస్తున్నావని బాధ పడడం లేదు. నిజమే–సినిమా అనవసరపు ఖర్చే కానీ, నా పిల్లల ఆనందం కొరకు ఇంకాస్త శ్రమపడి ఆ నాలుగు రూపాయలు వాళ్ళ కొరకు నేను ఖర్చుపెట్టడం నాకూ సంతోషమే. ఆ కారణంగా కాదు. సంగీతను వద్దన్నది.....ఆ పిల్లకు పదమూడేళ్ళు పూర్తయ్యాయి."

"అయితే....

"టీనేజ్‌లో అడుగుపెడుతున్న పిల్ల సంగీత, అపరిపక్వమైన వయస్సులో దృఢమైన నిర్ణయాలు తీసుకునే వయస్సు, ఆడపిల్లల్ని కాపాడుకోవాల్సిన వయస్సుకూడా ఇదే."

హేమ మాట్లాడలేదు.

పక్కనే వున్న రాధా మాధవం తీగను చేత్తో అటు ఇటు లాగుతోంది.

"హేమా! నేను జీవితంలో తప్పటడుగు వేశాను. పదిహేనేళ్ళ నా వయసులో నేను అపరిపక్వమైన నిర్ణయాలు తీసుకుని ఈ రోజు మనశ్శాంతి లేక అల్లాడిపోతున్నాను."

"దానికీ, దీనికీ ఏమిటి సంబంధం?" స్నేహితురాలి పక్కనే ఆనుకుని నిల్చుంటూ అడిగింది హేమ.

"ఈ రోజు సంగీత సినిమా అంటుంది పంపిస్తాను. రేపు అదే అలవాటవుతుంది. టీనేజ్‌లో ఏ అబ్బాయితోనో పరిచయం అవుతుంది. ఆ రోజూ సినిమా అంటుంది. ఆ అబ్బాయితో తిరుగుతుంది. ఆ వయస్సులో దగ్గర కొచ్చిన మగవాడే సర్వస్వం అనిపిస్తుంది. అతని కొరకు ఏదయినా చేయాలనిపిస్తుంది. నేనూ అలాగే ఈయనకు ఆత్మార్పణం చేసుకున్నా ననుకున్నాను ఆ రోజు."

"సంగీత వయస్సు ఎంతనుకుంటున్నావ్?" స్నేహితురాలిని ఆపి అడిగింది హేమ.

"ఈ వయస్సు నుండే మా అమ్మ నన్ను చెక్ చేస్తుంటే, హేమా మా అమ్మ చెప్పిన వాడ్ని పెళ్ళి చేసుకుని, అతని నీడలో హాయిగా బతుకుదునేమో!" ఆమె కంఠంలో అశ్రుకణాలు.

స్నేహితురాలి వైపు జాలిగా చూసింది హేమ.

"ఆ పిల్ల మీద అనవసరంగా భయాలు పెంచుకుంటున్నావనిపిస్తుంది అరూ"

"నో....నో.....హేమా. ఇది భయం కాదు. అపోహ కాదు. నా జీవితం నాకు నేర్పిన పాఠం నుండి నేను నేర్చుకున్న సత్యం."

"నేను ఈయనతో షికార్లు, సినిమాలకు వెళ్ళేది మా అమ్మకు తెలుసు. నే నింకా అచ్చనగాయలు, క్యారంబోర్డులు ఆడుకునే చిన్న పిల్లగానే అనుకుని అతనితో ఫ్రీగా వదిలేసిందమ్మ. టీనేజ్‌లో అడుగు పెట్టిన నాలో చదివేది కాన్వెంట్‌లో పదవ తరగతే అయినా, చూసే సినిమాలు నాకు నేర్పించిన ప్రేమ పాఠాలతో నేను ఎదిగి పోతున్నానని అమ్మకు తోచలేదు. ఆమెకు నేను పసిపిల్ల అరవిందనే కానీ, నాలో నేను ఎదిగిపోయాననేది అర్థం కాదు.

తీరా నా మనసు నేను బయట పెట్టినప్పుడయినా నన్ను కొట్టో, తిట్టో కట్టుదిట్టం చేసుంటే, హేమా, ఈ రోజు నాకీ నరకం ఉండేది కాదు.

అతన్ను తాగుబోతని తెలిసి ఓ గంట సేపు నా నిర్ణయానికి వెక్కిళ్ళు పెట్టి ఏడ్చిందే కానీ, జీవితం నేర్పిన అనుభవంతో నన్ను వారించలేదు.

నా మీద ప్రేమతో, నేను ఏమయిపోతానో అనే భయంతో సరే నంది. నా ప్రేమతో అతడ్ని మార్చుకోమని పాఠాలు చెప్పింది.

"హేమా! ఇతనింకా నయం. ఎంత తాగుబోతయినా, ఎంత దుర్మార్గుడయినా నన్ను పెళ్ళి చేసుకున్నాడు. అంతో ఇంతో నన్ను ఇంకా ప్రేమిస్తూనే వున్నాడు.

కానీ....కానీ.... హేమా! నా చిట్టితల్లి ఎవడికయినా దగ్గరయి

అతను మోసం చేస్తే నేను సహించను. ఆ అవకాశం నా సంగీతకు నేను కల్పించకూడదనే ఇప్పటి నుండీ నా కొంగు నీడనే వుంచుకో దల్చుకున్నాను. జీవితమనేది ఆటకాదు. హేమా, దాన్ని పరీక్షకు పెట్టడానికి" ఆవేశంతో ఆగింది అరవింద.

"నువ్వు అతిగా ఆలోచిస్తున్నావనిపిస్తుంది అరూ! నువ్వు వెతికి చేసిన వాడు ఆ పిల్లను బాగా చూస్తాడని గారంటీ ఏమిటి?"

"గారంటీ.....!ఉహుఁ.....లేదు. నేనొప్పుకుంటాను. కానీ, హేమా! నేను మా అమ్మకు ఛాయిస్ లేకుండా చేశాను. మా అమ్మ నా కొరకు వెతకబోయే పెళ్ళికొడుకుల్లో ఏ ఒక్క వ్యక్తో మంచి మనిషి కావడానికి అవకాశం వుండేది.

కానీ, నే నా అవకాశం మా అమ్మ కివ్వలేదు. నేను ఎన్నుకున్న మనిషి మనస్వత్తం నాకు సరిపడకపోయినా అలాటి మనస్తత్వంతో నేను సుఖపడలేనని అతనితో సంవత్సరం రోజుల నా పరిచయంలో కొంతలో కొంత నా కర్థమయినా అతడ్ని తప్ప మరొకడ్ని చేసుకోవడము పాపమనే భ్రమలో, అతని లోపాలు సులభంగా దిద్దుకోవచ్చనే పిచ్చి ఆశతో నా పసి వయస్సు అతని చిటికెన వేలు పట్టుకుంది. కానీ ఈ రోజు ఆ రోజు చేసిన పనికి చింతిస్తున్నాను. ఆ రోజే మా అమ్మ నన్ను చెక్ చేసుంటే బాగుణ్నని ఆమెను నిందించుకుంటున్నాను....ఆ దౌర్భాగ్యం పాపకు పట్టకూడదు హేమా" ఆమె కళ్ళలో కఠంలోకూడా తడి.

"పోనీలే, బాధపడకు. జరిగిపోయిందేదో జరిగిపోయింది. మీ అమ్మ తెచ్చిన వాడు కూడా ఇలాటి వాడే అయ్యుంటే సర్దుకోవా?

అలాగే సర్దుకో అరూ!" స్నేహితురాలి కూతురి మీద ఇంత వరకు వున్న జాలిని స్నేహితురాలిమీదికి మళ్ళించుకుని మనఃస్ఫూర్తిగా ఓదార్చబోయింది హేమ.

"నిజమే. నిజమే, హేమా! అమ్మ చేసిన పెళ్ళే అయితే 'అమ్మా! నువ్వు నా కొరకు వెతికి పెట్టిన మనిషి చూడు ఎలా హింసిస్తున్నాడో" అని చెప్పుకొని గుండెల్లో భారం దింపుకోనయినా అవకాశం వుండేది. కానీ, ఇప్పుడు....ఇప్పుడు ఎవరితో చెప్పుకుని భారం దించుకోను హేమా!"

ఇంక నిలవలేనట్టు, ఓర్చుకునే శక్తి లేనట్టు తెలివిగా ఆలోచించే మేధ చచ్చిపోయి వెక్కి వెక్కి ఏడుస్తున్న స్నేహితురాల్ని పొదివి పట్టుకుంది హేమ.